సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 21 । ఫిబ్రవరి । 2023



గోశాలకు కోడెలు అందజేత

వేములవాడఅర్బన్: రాజన్న 20 కోడెలను మహబూబాద్ జిల్లా నర్సింహులపేట మండలం పెద్దనాగారం గ్రామానికి చెందిన శివపార్వతి గోశాలకు అందజేశారు.



రాజన్న శరణు

వేములవాడ: రాజన్నకు జాతర భక్తుల రద్దీ తగ్గడం లేదు. సోమవారం దాదాపు 25 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0/17.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

డీఈఐసీని త్వరగా అందుబాటులోకి తేవాలి



వేములవాడఅర్బన్: డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్(డీఈఐసీ)ని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ అనురాగ్ జయంతి వైద్యాధికారులను ఆదేశించారు. వేములవాడ ఏరియా ఆస్పత్రిని సోమవారం పరిశీలించారు. ఆస్పత్రిలో ఏర్పాటు చేస్తున్న డీఈఐసీ సెంటర్‌తో నవజాత శిశువులలో శారీరక, నరాల సంబంధిత వైకల్యాలను నివారించవచ్చన్నారు. సిబ్బంది నియామకంతోపాటు మిగతా పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆస్పత్రి పర్యవేక్షకులు మహేశ్ పాల్గొన్నారు.

వైఎస్ షర్మిల అరెస్టు సరికాదు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రాము

వేములవాడఅర్బన్: వైఎస్ షర్మిల అరెస్టును ఖండిస్తున్నామని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము పేర్కొన్నారు. వేములవాడ నందికమాన్ వద్ద పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పాదయాత్రను చూసి ఓర్వలేకనే టీఆర్‌ఎస్ ప్రభుత్వం అరెస్ట్ చేస్తుందన్నారు. పాదయాత్రలో పేదలను కలిసి కష్టసుఖాలు తెలుసుకుంటుందన్నారన్నారు. ఎన్ని కుట్రలు చేసిన పాదయాత్ర ఆగబోదని స్పష్టం చేశారు. రానున్న కాలంలో వైఎస్సార్‌టీపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మహేశ్, ప్రశాంత్, అనిల్, ఆనంద్ ఉన్నారు.

పంటను పరిశీలించిన ప్రొఫెసర్లు

సిరిసిల్లఅర్బన్: వ్యవసాయ కళాశాల దత్తత గ్రామం తంగళ్లపల్లి మండలం రాళ్లపేటలోని వరిపంట పొలాలను సోమవారం వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. వరిలో మొగి పురుగు నివారణకు కార్తప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు ఎకరానికి 8 కిలోలు చల్లాలని సూచించారు. పశుగ్రాస పంట హెడ్జ్ లూసర్న్‌ను పరిశీలించారు. ప్రొఫెసర్ భారతి, సతీశ్, సంపత్‌కుమార్, వ్యవసాయ విస్తరణాధికారి చంద్రప్రకాశ్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : బండి సంజయ్



పార్టీలో చేరుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రానున్న ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని, ప్రతీ కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ సంజయ్‌కుమార్ కోరారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన 50 మంది యువకులు సోమవారం బీజేపీలో చేరారు. కరీంనగర్‌లోని ఎంపీ నివాసంలో జరిగిన కార్యక్రమంలో కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, రవీందర్, ప్రశాంత్, రాజు, ప్రకాశ్, సత్తయ్య, సాయికిరణ్, పర్శరాములు, తిరుపతి తదితరులు ఉన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీలు



సిరిసిల్ల: వేములవాడలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. వేములవాడలోని విశాలాక్షి డెంటల్, సాయిపల్లవి నర్సింగ్ హోం, సందీప్ చిల్డ్రన్ హాస్పిటల్, సహస్ర చిల్డ్రన్ హాస్పిటళ్లను జిల్లా వైద్యాధికారుల బృందం తనిఖీ చేసింది. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు, డిప్యూటీ డీఈఎంవో సంతోష్, వైద్యసిబ్బంది బాలయ్య, జలపతి, లింగం తదితరులు పాల్గొన్నారు.

దగ్గు.. జలుబు.. జ్వరం



- చేతికి సెలైన్‌తో సొమ్మసిల్లి నిద్రపోతున్న ఈమె పేరు జక్కుల అనసూర్య(55). సిరిసిల్లలోని పద్మనగర్‌కు చెందిన ఈమె కూలి పనిచేస్తుంది. అనసూర్యకు ముగ్గురు పిల్లలు కాగా.. భర్త చనిపోయాడు. మూడు రోజులుగా జ్వరం వస్తుంది. స్థానిక ఆర్‌ఎంపీ డాక్టర్ వద్ద మందులు తీసుకున్నా తగ్గలేదు. చేతిలో డబ్బులు లేకపోవడంతో సిరిసిల్ల జిల్లా ఆస్పత్రిలో సోమవారం చేరింది. వైద్యులు సెలైన్ పెట్టారు.



- ఇతని పేరు భూక్యా మోజ్యానాయక్. వీర్నపల్లి మండలం లాల్‌సింగ్‌తండాకు చెందిన మోజ్యానాయక్‌కు నాలుగు రోజులుగా జ్వరం, వాంతులు, కాళ్లు, చేతుల నొప్పులు. వ్యవసాయం చేస్తూ ఊరిలోనే కూలి పనిచేసే మోజ్యాకు జ్వరం రావడంతో స్థానికంగా వైద్యం చేయించుకున్నాడు. ఎంతకూ తగ్గకపోవడంతో సిరిసిల్ల జిల్లా ఆస్పత్రిలో రెండు రోజుల కిందట చేరాడు. ఇప్పుడు కొంచెం జ్వరం తగ్గింది. ఇంటికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నాడు.



- చేతికి ఐవీ సెట్‌తో ఉన్న ఈమె పేరు నీరటి కనకవ్వ(55). వేములవాడ అర్బన్ మండలం అనుపురం గ్రామానికి చెందిన కనకవ్వ దినసరి కూలి. ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. సిరిసిల్ల ఆస్పత్రిలో చేరింది. వైద్యులు మందులు, గోళీలు ఇచ్చి సెలైన్ పెట్టారు. ఇప్పుడు కొద్దిగా జ్వరం జారింది. కనకవ్వ భర్త మొండయ్య చనిపోగా.. కొడుకు దేవరాజు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తాడు.



- ఇతని పేరు దీకొండ సంతోష్(25). సిరిసిల్లలోని ధోబీగల్లీకి చెందిన సంతోష్ స్థానికంగా షాపింగ్‌మాల్‌లో పనిచేస్తాడు. నాలుగు రోజుల కిందట జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడ్డాడు. స్థానికంగా ఆర్‌ఎంపీ డాక్టర్‌కు చూపించినప్పటికీ తగ్గలేదు. శరీరనొప్పులు ఎక్కువ కావడంతో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. వైద్యులు మందులు ఇవ్వడంతో ఇప్పుడు జ్వరం తగ్గింది. ఆస్పత్రి నుంచి ఇంటికి వెళ్లేందుకు సిద్ధమయ్యాడు.



సిరిసిల్లలోని జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

- జిల్లాను వణికిస్తున్న వైరల్ ఫీవర్స్
- ప్రతీ ఇంట్లో జ్వర బాధితులు
- మంచం పట్టిన పల్లెలు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరిగిన రోగులు
- ఆర్‌ఎంపీల వద్ద క్యూ.. ప్రైవేటు ఆస్పత్రులు కిటకిట

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాను వైరల్ ఫీవర్స్ వణికిస్తున్నాయి. ఏ పల్లెకు పోయిన జ్వరబాధితులే కనిపిస్తున్నారు. ఇంటికొకరు జ్వరంతో బాధపడుతున్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులతో జలుబు, దగ్గు, జ్వరంతో ఇబ్బంది పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఒక్కసారిగా జ్వరాలు విస్తరించడంతో ఆస్పత్రుల నిండా జ్వరపీడితులే కనిపిస్తున్నారు. పట్టణాలు, పల్లెలు, గిరిజన తండాలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ విషజ్వరాలు వ్యాపించాయి. ఆర్థికంగా ఏమాత్రం ఉన్నా ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరి వైద్యం చేయించుకుంటున్నారు. ఆర్థికంగా లేని వారు స్థానికంగా ఉండే ఆర్‌ఎంపీ, పీఎంపీల వద్ద వైద్య సేవలు పొందుతున్నారు. ఆర్థిక స్థితి బాగా లేని పేదలు సర్కారు వైద్యంపై నమ్మకంతో ఏరియా ఆస్పత్రిలో చేరుతున్నారు. ఒక్కసారి జ్వరం వచ్చిన వారు ఏం తినక, నోరు రుచించక, మంచం పట్టి శరీరకంగా బలహీనపడుతున్నారు. మూడు రోజులకు మించి మంచానికే పరిమితమవుతున్నారు. పదేళ్ల లోపు పిల్లలు కూడా జ్వరాలతో బాధపడుతున్నారు.



సిరిసిల్ల ఆస్పత్రిలో ఓపీ చిట్టీ కోసం క్యూలైన్

భయపడాల్సిందేమీ లేదు



జిల్లాలో వైరల్ ఫీవర్స్ వస్తున్నాయి. మామూలుగా వచ్చే జ్వరాలు, దగ్గు, జలుబులు ఉన్నాయి. భయపడాల్సిందేమీ లేదు. మందులు వాడుకుంటే తగ్గిపోతుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ పేషెంట్ల సంఖ్య పెరిగింది. రోగుల అవసరాల మేరకు మందులు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో ఇబ్బంది ఏమీ లేదు.

– సుమన్‌మోహన్‌రావు, జిల్లా వైద్యాధికారి

జిల్లాలో జ్వరపీడితులు..

పీహెచ్‌సీలు :	15
పీహెచ్‌సీలకు రోజూ వచ్చే రోగులు :	700 నుంచి 1000
ఆర్‌ఎంపీ వైద్యులు :	996
ఆర్‌ఎంపీల వద్దకు వచ్చే రోగులు :	4,980
జిల్లా ఆస్పత్రిలో రోజూ ఓపీ :	600
వేములవాడ ఏరియా ఆస్పత్రిలో ఓపీ :	250
జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు :	60
ప్రైవేటు ఆస్పత్రుల్లో జ్వరపీడితులు :	380
మొత్తం జ్వర పీడితులు :	7,000(అంచనా)

నష్టపరిహారం చెల్లించాలి



ధర్నా చేస్తున్న నర్మాల ఫుడ్ ఫ్యాక్టరీ భూబాధిత రైతులు

గంభీరావుపేట(సిరిసిల్ల): నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ మండలంలోని నర్మాలలో చేపట్టిన ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ కోసం భూములు కోల్పోయిన రైతులు సోమవారం ధర్నాకు దిగారు. తమ నుంచి ప్రభుత్వం తీసుకున్న భూములకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం రూ.23లక్షల చొప్పున చెల్లించాలని కోరారు. భూమి కోల్పోయిన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఉపాధి కల్పించాలని కోరారు. ఆ భూములలో రైతులు పెంచుకున్న చెట్లకూ నష్టపరిహారం ఇవ్వాలని, ఆక్రమిత భూములకూ డబ్బులు చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. కర్రొల్ల రాజు, కల్యాణ్, నర్సింలు, ఆంజనేయులు, లింగం, చంద్రం, బాబు, శంకర్, సత్యం, బాలరాజు, బుచ్చయ్య పాల్గొన్నారు.

యారన్ సబ్సిడీ చెల్లించాలి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): పవర్‌లూమ్ కార్మికులకు ప్రభుత్వం పది శాతం యారన్ సబ్సిడీని త్వరగా చెల్లించాలని సీఐటీయూ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ కోరారు. తంగళ్లపల్లిలోని మార్కండేయ ఆలయం హాల్‌లో సోమవారం కార్మికులతో మాట్లాడారు. బతుకమ్మ చీరలకు సంబంధించి కార్మికులకు రావాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీని అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. వర్కర్ టు ఓనర్ పథకానికి సంబంధించి పెద్దూరు శివారులో నిర్మిస్తున్న వీవింగ్ పార్కును వెంటనే పూర్తి చేయాలని కోరారు. మార్చి 1న పవర్‌లూమ్ పరిశ్రమ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు పేర్కొన్నారు. సీఐటీయూ కార్యదర్శి కోడం రమణ, నాయకులు మోర అజయ్, ఎలిగేటి రాజశేఖర్, గోవిందు లక్ష్మణ్, కుడిక్యాల కనకయ్య, గోరంతల రాజమల్లు, మూషం శంకర్, అన్నల్‌దాస్ గంగాధర్, కోడం వేణు, నర్సయ్య పాల్గొన్నారు.

కరెంట్ లేక పొలాలు ఎండుతున్నాయి

- విద్యుత్ వినియోగదారుల ఆవేదన
- సిరిసిల్లలో ఈఆర్‌సీ బహిరంగ విచారణ
- వినియోగదారులతో మర్యాదగా ప్రవర్తించాలి
- ఈఆర్‌సీ చైర్మన్ శ్రీరంగారావు



మాట్లాడుతున్న శ్రీరంగారావు



హాజరైన 'సెస్' అధికారులు, వినియోగదారులు

సిరిసిల్ల: జిల్లాలో విద్యుత్ కోతలు తీవ్రంగా ఉన్నాయని, వేళాపాళ లేని కరెంట్ కోతలతో పొలాలు ఎండుతున్నాయని 'సెస్' వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (టీఎస్ ఈఆర్‌సీ) 2023–2024 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ ఆవశ్యకతపై సోమవారం బహిరంగ విచారణ చేపట్టారు. జిల్లాలో విద్యుత్ సరఫరా సంఘం(సెస్) సంస్థ విద్యుత్ పంపిణీ చేస్తుందని జిల్లా రైతులపై ఎన్పీడీసీఎల్ అధికారులు సవతి తల్లి ప్రేమను చూపుతున్నారని వినియోగదారులు ఆరోపించారు. యాసంగి ప్రారంభానికి ముందు 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటించిన అధికారులు ఇప్పుడు 12 గంటలు కూడా కరెంట్ ఇవ్వడం లేదన్నారు. విద్యుత్ సరఫరా వేళలు ప్రకటించాలని, ఖచ్చితంగా సమయపాలన పాటించాలని వినియోగదారులు కోరారు. కొత్త విద్యుత్‌లైన్ల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు వంటి పనుల్లో 'సెస్' సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని సభ్యులు అధికారుల దృష్టికి తెచ్చారు. 'సెస్' సంస్థకు మండలకేంద్రాల్లో సేవా భవనాలు నిర్మించి రైతులకు విశ్రాంతి కల్పించాలని స్తంభంపల్లికి చెందిన పులి లక్ష్మీపతిగౌడ్ కోరారు. అకారణంగా తమ విద్యుత్ మీటర్‌ను తొలగించారని రాజన్నపేటకు చెందిన దేవయ్య వాపోయాడు. విద్యుత్‌తీగలతో ఓ ప్రాణం పోయి రూ.2 లక్షలు నష్టపరిహారం చెల్లించాల్సి వచ్చిందని సిరిసిల్ల సుందరయ్యనగర్‌కు చెందిన భూమక్క వివరించారు. ఇప్పటికే విద్యుత్ బిల్లులు ఎక్కువగా ఉన్నాయని, ఇకపై విద్యుత్ చార్జీలు పెంచవద్దని సంపత్‌రావు కోరారు. జిల్లాలోని అనేక గ్రామాల్లో 'సెస్' క్షేత్రస్థాయి సిబ్బంది సహకారంతో అక్రమ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, సిబ్బంది అవినీతితోనే విద్యుత్ వినియోగిస్తున్నారన్నారు.

మర్యాదగా ప్రవర్తించాలి

విద్యుత్ వినియోగదారులతో 'సెస్' అధికారులు మర్యాదగా ప్రవర్తించాలని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ చైర్మన్ టి.శ్రీరంగారావు సూచించారు. వినియోగదారుల సమస్యలను గుర్తించి సత్వర సేవలందించాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. విద్యుత్ సరఫరాలో వినియోగదారులకు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. ఏమైన సమస్యలుంటే టీఎస్‌ఈఆర్‌సీ దృష్టికి తేవాలన్నారు. టీఎస్ ఈఆర్‌సీ సభ్యులు ఎండీ మనోహర్‌రావు, బి.కృష్ణయ్య, 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు, వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, 'సెస్' ఎండీ రామకృష్ణ, 'సెస్'డైరెక్టర్లు దార్నం లక్ష్మీనారాయణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

2025లో కరీంనగర్‌కు రైలు..!

- మరో రెండేళ్లలో కొత్తపల్లి–మనోహరాబాద్ మార్గం పూర్తి
- ఈ ఏడాది దుద్దెడ, సిద్దిపేటకు, 2024లో సిరిసిల్లకు రైలు
- కొండగట్టు మాస్టర్‌ప్లాన్‌తో ఈ మార్గానికి పెరిగిన డిమాండ్
- ఒకేమార్గంలో కొమురవెల్లి, వేములవాడ, కొండగట్టు, కాళేశ్వర పుణ్యక్షేత్రాలు
- హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్లకు ముఖద్వారంగా కరీంనగర్



కరీంనగర్ రైల్వేస్టేషన్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే ప్రాజెక్టు తుదిదశకు వచ్చింది. మరో రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే లక్ష్యాన్ని విధించుకుంది. ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే చాలా వేగంగా పనులు చేపడుతోంది. 2025 మార్చి వరకు ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయనున్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ప్రాజెక్టు స్వరూపం, ఖర్చు, పూర్తి చేసే తేదీ తదితరాలను ప్రకటించింది. సికింద్రాబాద్ నుంచి కరీంనగర్‌ను కలుపుతూ రూపొందించిన మనోహరాబాద్ (మేడ్చల్)– కొత్తపల్లి (కరీంనగర్) రైల్వే ప్రాజెక్టు ఇది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు అధిక ఖర్చు, వయబిలిటీ ఉండదన్న కారణాలతో పక్కన పెట్టిన ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం వినతితో 2016లో దక్షిణ మధ్య రైల్వే చేపట్టింది. ప్రస్తుతం గజ్వేల్ వరకు ట్రయల్ రన్ నడుస్తోంది. ప్రభుత్వం వేములవాడ, కొండగట్టుకు మాస్టర్‌ప్లాన్ రూపొందించి అభివృద్ధి చేస్తుండటంతో ఈ మార్గంలో ఆధ్యాత్మిక పర్యాటకం ఊపందుకోనుంది.

మాస్టర్‌ప్లాన్లతో పెరిగిన డిమాండ్..!

ఈ ప్రాజెక్టు పూర్తయితే.. రాష్ట్రంలో పలు ఆధ్యాత్మిక క్షేత్రాలు ఒకే రైల్వేలైను పరిధిలో దర్శించుకునే వీలు కలుగుతుంది. ఈ మార్గంలో కొమురవెల్లి, కొండపోచమ్మ, నాచారం లక్ష్మీ నర్సింహా స్వామి, నాంపల్లి, వేములవాడ పుణ్యక్షేత్రాలు వస్తాయి. కొత్తపల్లి స్టేషన్ అందుబాటులోకి వస్తే.. అక్కడ నుంచి కరీంనగర్ స్టేషన్ నుంచి కొండగట్టు (నూకపల్లి–మల్యాల)స్టేషన్‌కు కలపవచ్చు. ఇటీవల బడ్జెట్‌లో వేములవాడ మాస్టర్ ప్లాన్ కోసం రూ.50 కోట్లు, కొండగట్టుకు రూ.600 కోట్లు ప్రకటించడంతో ఈ రెండు పుణ్యక్షేత్రాలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఈ రెండు ఆలయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్ ప్రాధాన్యం పెరిగింది. ఇదే విషయాన్ని దక్షిణమధ్య రైల్వే కూడా గుర్తించింది. అందుకే, ఈ రైల్వేలైన్‌ను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసే పట్టుదలతో ఉన్నామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు ధీమాగా ఉన్నారు. ఈ ప్రాజెక్టు ఇప్పటికే 46 శాతం మేర ప్రాజెక్టు పూర్తయింది.

షిరిడీ, ముంబై, బెంగళూరులకు రైళ్లు..!

కొత్తపల్లి– మనోరాబాద్ రైల్వేలైన్ హైదరాబాద్ డివిజన్‌లో ఉంది. అదే ఖాజీపేట–బల్లార్షా మార్గం సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోకి వస్తుంది. ఈ రెండు మార్గాలకు కొత్తపల్లి జంక్షన్‌లా మారనుంది. ఉత్తరభారతదేశానికి దక్షిణ భారతదేశానికి ఇది ముఖద్వారంగా అవతరించనుంది. ఈ మార్గం పూర్తయితే ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల, సిద్దిపేట, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ వాసులకు షిరిడీ, ముంబై, షిరిడీ, బెంగళూరులకు రైళ్లు నడపొచ్చని దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు.

ప్రాజెక్టు పురోగతి..!

సంవత్సరం	మార్గాలు	లక్ష్యం	కిలోమీటర్లు
2020-21	మనోహరాబాద్–గజ్వేల్	పూర్తయింది	31.071
2021-22	గజ్వేల్–కొడకండ్ల	పూర్తయింది	12.25
2022-23	కొడకండ్ల–దుద్దెడ	ఆగస్టు 2023	21.50
2023-24	దుద్దెడ–సిద్దిపేట	డిసెంబర్ 2023	11.10
2023-24	సిద్దిపేట–సిరిసిల్ల	మార్చి 2024	37.15
2024-25	సిరిసిల్ల–కొత్తపల్లి	మార్చి 2025	39.01

ఏడాది చివరలో సిద్దిపేట, దుద్దెడలకు..

ప్రాజెక్టులో భాగంగా ప్రస్తుతం మనోహరాబాద్–గజ్వేల్ మధ్య 32 కి.మీ మేర ట్రాక్ పూర్తయి ట్రయల్‌రన్ నడుస్తోంది. గజ్వేల్ నుంచి కొడకండ్ల వరకు కొత్తగా నిర్మించిన 12.5 కిలోమీటర్ల మార్గం కూడా పూర్తయి ట్రయల్‌రన్‌కు సిద్ధంగా ఉంది. ఇక ఈ ఏడాది ఆగస్టులో కొడగండ్ల–దుద్దెడను ఆగస్టులో, దుద్దెడ–సిద్దిపేటను డిసెంబరులో, సిద్దిపేట సిరిసిల్ల వచ్చే ఏడాది మార్చిలో, సిరిసిల్ల– కొత్తపల్లి 2025 మార్చిలో పూర్తి చేయనున్నారు. ఇప్పటివరకు పనులన్నీ అనుకున్న విధంగా గడువులోనే జరుగుతుండటం గమనార్హం.

మనోహరాబాద్-కొత్తపల్లి ప్రాజెక్టు (151.36 కిలోమీటర్లు) వివరాలు..

ప్రాజెక్టు యొక్క పొడవు	151.36 కిలోమీటర్లు
మంజూరైన సంవత్సరం	2016-17
ప్రాజెక్టు ఖర్చు	రూ. 1,167కోట్లు
ఇప్పటి వరకు ఖర్చు	రూ.796.92 కోట్లు
పొడవు ప్రారంభం (కిలో మీటర్లు)	31.071 కిలోమీటర్లు
భూసేకరణ హెక్టార్లు	1079.816(అవసరం) (సేకరించింది:703.116)
అటవీభూమి (హెక్టార్లు)	2.200(అవసరం) (సేకరించింది: 2.200)

ముఖ్యమైన బ్రిడ్జిలు	01
మేజర్ బ్రిడ్జిలు	21
చిన్న బ్రిడ్జిలు	153
సబ్‌వేలు, ఆర్‌యూబీలు	37
స్టేషన్లు	14
భౌతిక పురోగతి	46 శాతం
ప్రాజెక్టు పూర్తి	2024-25

క్లుప్తంగా

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమం

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



మాట్లాడుతున్న గుంటి వేణు

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సీపీఐ ఉద్యమాలు చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు హెచ్చరించారు. ముస్తాబాద్‌లో సోమవారం నిర్వహించిన సీపీఐ కార్యకర్తల సమావేశంలో వేణు మాట్లాడారు. అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని, సొంత స్థలం ఉన్న వారికి రూ.5లక్షల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ పథకాన్ని విస్తృతం చేయాలని కోరారు. ఈనెల 23న కరీంనగర్‌లో రెవెన్యూ గార్డెన్స్‌లో సీపీఐ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మీసం లక్ష్మణ్, మిద్దె నర్సయ్య, పర్శరాములు, పద్మారెడ్డి, కిషన్, మల్లేశం, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

భూతగాదాలో ముగ్గురిపై కేసు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరుపతి

వేములవాడరూరల్: మండలంలోని నూకలమర్రిలో భూతగాదాలో ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు. భూతగాదాలతో గ్రామానికి చెందిన పెద్దవేని మల్లయ్య, భార్య నర్సవ్వ, కొడుకు లక్ష్మణ్‌లు తిరుపతిపై దాడి చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నాగరాజు వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. బాధితుడి భార్య నాగమణి ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జేసీబీ, రెండు ట్రాక్టర్లు సీజ్



అధికారులు సీజ్ చేసిన జేసీబీ

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని నాగారంలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్న జేసీబీ, రెండు ట్రాక్టర్లను సోమవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ నరేందర్ తెలిపారు. నాగారం కొత్త చెరువు వద్ద అనుమతి లేకుండా తవ్వకాలు చేస్తూ మట్టి తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి జేసీబీ, రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని కనగర్తి మూలవాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ట్రాక్టర్ యజమాని పుట్ట చందు, డ్రైవర్ మాదం ప్రశాంత్‌లపై కేసు నమోదు చేశామన్నారు. గ్రామంలో ఎవరైన అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

స్టీరింగ్ ఫెయిలై ఆటో బోల్తా

- 16 మంది కూలీలకు గాయాలు
- 23 మందితో బోల్తాపడిన గూడ్స్ ఆటో
- సిరిసిల్ల ఆస్పత్రికి తరలింపు
- అందరూ చీర్లవంచ గ్రామస్తులే



ప్రమాదస్థలంలో కూలీలు



ఆసుపత్రిలో ఆర్తనాదాలతో క్షతగాత్రులు



కుడిచేయి విరిగిన పలుమర్ల లలిత



చికిత్స పొందుతున్న వేల్పుల ఓదవ్వ



పక్కటెముకలు ఫ్యాక్చర్ అయిన మల్లవ్వ

ఇల్లంతకుంట(మానకొండూర్)/తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఆటో స్టీరింగ్ ఫెయిల్ కావడం ఆటోబోల్తా పడిన సంఘటనలో 16 మంది కూలీలు గాయపడ్డారు. ఏడుగురు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలం చీర్లవంచకు చెందిన 22 మంది వ్యవసాయ కూలీలు ఇల్లంతకుంట మండలంలోని నర్సక్కపేటకు పత్తి తీసే పనులకు ఉదయం ట్రాలీ ఆటోలో బయలుదేరారు. ఇల్లంతకుంట మండలంలోని వల్లంపట్లకు చేరుకోగానే ఆటో స్టీరింగ్ ఫెయిల్ కావడంతో ఒక్కసారిగా రోడ్డు పక్కకు దూసుకుపోయి బోల్తాపడింది. ఎస్సై మహేందర్ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో ఆటో డ్రైవర్ గంట పర్శరాములుతోపాటు 22 మంది కూలీలు ప్రయాణిస్తున్నారు. ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు, 16 మందికి స్వల్పంగా గాయపడగా.. ఏడుగురు క్షేమంగా బయటపడ్డారు. ఆటో బోల్తా పడిన ఘటనలో చీర్లవంచకు చెందిన వేల్పుల ఓదవ్వ పరిస్థితి విషమంగా ఉండగా.. ఐసీయూలో చికిత్స పొందుతోంది. పలుమరి లలితకు కుడి చెయ్యి విరిగింది. బోయిని మల్లవ్వ పక్కటెముకలకు గాయాలయ్యాయి. నర్మెట అంజవ్వ, పుష్పవ్వ, జెరిపోతుల కనకవ్వ, దుర్గవ్వ, మానువాడ దేవవ్వ, రేణుక, ముస్కానిపేట లచ్చవ్వ, కదారి బీరయ్య, పలుమరి లావణ్య, మల్లవ్వ, పద్మ, బోయిని మల్లయ్య, గంగ దేవేంద్రలకు స్వల్ప గాయాలయ్యాయి.

క్షతగాత్రులకు పరామర్శలు

క్షతగాత్రులను సిరిసిల్ల ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా తంగళ్లపల్లి జెడ్పీటీసీ పూర్మాని మంజుల–లింగారెడ్డి దంపతులు పరామర్శించారు. తక్షణ సాయంగా కొంత నగదు, భోజనం ఏర్పాటు చేశారు. ఎంపీపీ పడిగెల మానస, చీర్లవంచ సర్పంచ్ జక్కుల రవీందర్, నాయకులు జక్కుల నాగరాజు, జాలగం ప్రవీణ్(టోని) పరామర్శించారు.

మహాజాతర ఆదాయం రూ.1.22 కోట్లు



రాజన్న ఆలయం వద్ద భక్తుల సందడి

వేములవాడ: వేములవాడ రాజన్నకు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మూడు రోజుల్లో భక్తుల ద్వారా రూ.1.22 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో ప్రతాప నవీన్ సోమవారం ప్రకటించారు. గతేడాది మహాజాతర కంటే రూ.2 లక్షల ఆదాయం తగ్గింది.

ఆదాయం సమకూరింది ఇలా..

కోడె మొక్కులు : రూ.55.24 లక్షలు
ఆర్జిత సేవలు : రూ.48.58 లక్షలు
కేశఖండనం : రూ.4.36 లక్షలు
శీఘ్రదర్శనం : రూ.4.03 లక్షలు
అతిశీఘ్రదర్శనం : రూ.4.15 లక్షలు
బద్దిపోచమ్మ ఆలయం : రూ.1.81 లక్షలు
భీమేశ్వరస్వామి ఆలయం : రూ.1.28 లక్షలు
నగరేశ్వరస్వామి ఆలయం : రూ.13 వేలు
వసతిగదులు : రూ.64 లక్షలు
ఇతర ఆదాయాలు : రూ.41 లక్షలు

ఆర్టీసీ ఆదాయం రూ.12.81 లక్షలు

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న ఆలయంలో వైభవంగా జరిగిన మహాశివరాత్రి వేడుకలకు వేములవాడ ఆర్టీసీ డీపో బస్సులతో రూ.12.81 లక్షల ఆదాయం సమాకూరినట్లు డీఎం మురళీకృష్ణ తెలిపారు. గతేడాది మహాశివరాత్రికి రూ.9 లక్షలు రాగా.. ఈ సంవత్సరం అధికంగా ఆదాయం వచ్చింది. ఈనెల 17, 18, 19 మూడు రోజులలో 60 బస్సులు 27 వేల కిలోమీటర్లు తిరిగి 22 వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసినట్లు డీఎం వివరించారు.

పని స్థలంలో కనిపించని బడి

- కనీస సౌకర్యాలు కల్పించని క్రషర్ యజమాని
- రాళ్లపేట క్రషర్‌లో స్కూల్ లేదు
- తల్లిదండ్రులతోనే పనికి వెళ్తున్నామన్న చిన్నారులు



రాళ్లపేట క్రషర్‌లో చిన్నారులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ప్రతీ పనిస్థలంలో వర్క్‌సైట్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా విద్యాధికారులు చెప్పిన మాటలు అమలుకావడం లేదు. తంగళ్లపల్లి మండలంలోని రాళ్లపేట క్రషర్ వద్ద బడి లేక అక్కడి కార్మికుల పిల్లలకు విద్య అందడం లేదు. రాళ్లపేట క్రషర్‌లో సుమారు 15 కుటుంబాలు పనిచేస్తున్నాయి. ఆయా కుటుంబాలలో పదేళ్లలోపు పిల్లలు 10 మంది వరకు ఉన్నారు. ఆ చిన్నారులకు పాఠశాల అంటే తెలియదు. ఈ విషయం సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు క్రషర్ సందర్శనకు వెళ్లగా వెలుగుచూసింది. కాంగ్రెస్ నాయకులు వస్తున్నారని తెలుసుకున్న క్రషర్ యజమానులు అప్రమత్తమై చిన్నారులను అక్కడి గదుల్లో దాచిపెట్టారు. గమనించిన నాయకులు తలుపులు తెరిచి చూడగా చిన్నారులు కనిపించారు. వారితో కాంగ్రెస్ నాయకులు మాట్లాడగా.. తాము బండరాళ్లను సైతం కొడతామని చెప్పుకొచ్చారు. ఇప్పటి వరకు బడికి పోలేదన్నారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

మార్చిలో 'వర్కర్ టు ఓనర్' లబ్ధిదారుల ఎంపిక

- తొలివిడతగా 1,104 మంది కార్మికులకు అవకాశం
- కలెక్టర్ అధ్యక్షతన లబ్ధిదారుల ఎంపిక
- హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయం



హైదరాబాద్‌లో అధికారులతో సమీక్షిస్తున్న జౌళిశాఖ కార్యదర్శి బుద్ధప్రకాశ్ జ్యోతి, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్

సిరిసిల్ల: కార్మికులను యజమానులుగా మార్చే 'వర్కర్ టు ఓనర్' పథకానికి అడుగులు పడుతున్నాయి. దీనిపై హైదరాబాద్‌లో సోమవారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. సిరిసిల్ల పట్టణ శివారులోని పెద్దూరు బైపాస్‌రోడ్డులో 88 ఎకరాల్లో రూ.387.61 కోట్లతో వీవింగ్ పార్క్ నిర్మిస్తున్నారు. మొదటి విడతగా 1,104 మంది కార్మికులను ఓనర్లుగా మార్చనున్నారు. ఒక్కో కార్మికుడికి నాలుగు ఆధునిక మగ్గాలను అందించేందుకు 4,416 మగ్గాలను కొనుగోలు చేస్తున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో సిరిసిల్లలో లబ్ధిదారులను ఎంపిక చేయాలని సమావేశంలో నిర్ణయించారు. కలెక్టర్ అధ్యక్షతన ఎంపిక చేయాలని భావిస్తున్నారు. పరిశ్రమలశాఖ కార్యదర్శి బుద్ధప్రకాశ్ జ్యోతి, తెలంగాణ పవర్‌లూమ్స్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మంత్రి కేటీఆర్ వ్యక్తిగత కార్యదర్శి కె.శ్రీనివాస్, జౌళిశాఖ అడిషనల్ డైరెక్టర్ పి.వెంకటేశం, ఐఎల్ఎఫ్ అధికారి చారి, జౌళిశాఖ జాయింట్ డైరెక్టర్ తస్నీం అథార్ జహాస్, ఆర్‌డీడీ వి.అశోక్ రావు, ఏడీ సాగర్ పాల్గొన్నారు.

విచారణ పేరుతో కలెక్షన్?

- ఉన్నతాధికారి మందలింపుతో తిరిగి వచ్చిన వైనం
- మండలంలోని జోరుగా చర్చ

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని రెండు గ్రామాల సర్పంచులపై కొందరు ఫిర్యాదు చేయగా విచారణకు వచ్చిన జిల్లా స్థాయి అధికారి వారి నుంచి డబ్బులు దండుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామపంచాయతీలో పలు అవకతవకలు జరిగినట్లు గ్రామస్తులు కొందరు జిల్లా అధికారికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయంపై విచారణకు వచ్చిన అధికారి విచారణ వారి నుంచి ముడుపులు తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయం కాస్త జిల్లా ఉన్నతాధికారికి తెలియడంతో సదరు అధికారిని మందలించి ఆ డబ్బులను సదరు ప్రజాప్రతినిధులకు ఇప్పించినట్లు చర్చలు సాగుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ అధికారి ముడుపులు తీసుకున్న విషయం.. మళ్లీ ఆ ప్రజాప్రతినిధులకు తిరిగి ఇచ్చిన విషయంపై వేములవాడరూరల్ మండలంలో రెండు రోజులుగా జోరుగా చర్చించుకుంటున్నారు.

తేలిన కంకరపై మళ్లీ సిమెంట్ రోడ్డు



వంద రోజులకే తేలిన కంకర రాళ్లు!

జనవరి 21న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం



పోచమ్మ ఆలయం ముందు కొత్తగా సిమెంట్ రోడ్డు నిర్మాణం

సాక్షి ఎఫెక్ట్

సిరిసిల్ల: 'రాజుల సొమ్ము రాళ్ల పాలు' అన్నట్లుగా ప్రజాధనంతో వేసిన రోడ్లు మూన్నాళ్ల ముచ్చటగానే మిగులుతున్నాయి. సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన సిమెంట్ రోడ్డును నాలుగు నెలలకే మళ్లీ వేస్తున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. రూ.25 లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్డు వంద రోజులకే కంకర తేలింది. మున్సిపల్ కాంట్రాక్టర్ల ధనదాహానికి, ఇంజినీరింగ్ అధికారుల పట్టింపులేని పనితీరుకు నిదర్శనంగా నిలిచింది. స్థానిక పోచమ్మ ఆలయం ముందు అంబేద్కర్ నగర్‌కు వెళ్లే దారిలో రూ.25 లక్షలతో నాలుగు నెలల కిందట సిమెంట్ రోడ్డు వేశారు. వేసిన కొద్ది రోజులకే సిమెంట్ రోడ్డు కంకరరోడ్డుగా మారింది. దీనిపై 'సాక్షి'లో జనవరి 21న 'వంద రోజులకే తేలిన కంకర రాళ్లు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి మున్సిపల్ ఇంజినీర్లపై, సదరు కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కంకరతేలిన ఆ రోడ్డును పునర్‌నిర్మించే దాకా బిల్లు ఇవ్వవద్దని ఆంక్షలు విధించారు. దీంతో సదరు కాంట్రాక్టర్ సోమవారం పోచమ్మవీధిలో సిమెంట్ రోడ్డును మళ్లీ వేయడం గమనార్హం. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపానికి అద్దం పడుతున్న ఈ సిమెంట్ రోడ్డును నాలుగు నెలల్లో రెండోసారి నిర్మించడం విశేషం. 'సాక్షి' కథనంతో శిథిలమైన సిమెంట్ రోడ్డును మళ్లీ నిర్మించడం గమనార్హం.

ఫిట్స్‌తో యువకుడి మృతి



ప్రేమ్‌కుమార్(ఫైల్)

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన పాటి ప్రేమ్‌కుమార్(24) ఫిట్స్‌తో సోమవారం మృతిచెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన పాటి లింగవ్వ–మల్లయ్య దంపతుల కొడుకు ప్రేమ్‌కుమార్ ఆరు నెలలుగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఖరీదైనా వైద్యం చేయించే ఆర్థికస్తోమత లేని నిరుపేద కుటుంబం. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. వ్యాధి నయం కాలేదు. చేతికందిన కొడుకు మరణించడంతో ఆ తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

వేములవాడఅర్బన్: మండలంలోని ఆరెపల్లి శివారు కరీంనగర్–సిరిసిల్ల రహదారిలో సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్ నుంచి కారులో వస్తున్న వేములవాడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగరాజును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. నాగరాజుకు తీవ్రగాయాలు కావడంతో 108లో వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



వినయ్ (ఫైల్)

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని రేచపల్లికి చెందిన గట్ల వినయ్(20) సోమవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రేచపల్లికి చెందిన రత్నాకర్–పద్మ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. తల్లిదండ్రులు దర్జీ పని చేసుకుంటూ జీవిస్తుండగా.. కుమారుడు వినయ్ జగిత్యాలలో డిగ్రీ చదువుతున్నాడు. రత్నాకర్–పద్మ, వారి కుమార్తెతో కలిసి సోమవారం దుబ్బరాజన్న జాతరలో రథోత్సవం చూసేందుకు వెళ్లారు. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఇంటికి చేరేసరికి ఇంట్లో వినయ్ ఉరేసుకుని వేలాడుతుండటాన్ని గుర్తించి వెంటనే కిందికి దించారు. సారంగాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. వినయ్ ఆత్మహత్యపై ఇంకా వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మక్తాపూర్‌లో బాలుడు..

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని మక్తపల్లికు చెందిన గంట రమేశ్(17) కడుపునొప్పి భరించలేక సోమవారం వేకువజామున ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ప్రమోద్‌రెడ్డి కథనం ప్రకారం.. గంగిరెద్దుల సామాజిక వర్గానికి చెందిన పాపయ్య కుమారుడు రమేశ్ కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం కడుపునొప్పి ఎక్కువ కావడంతో ఆందోళనకు గురైన రమేశ్ నొప్పి భరించలేక ఇంటి నుంచి వెళ్లిపోయాడు. నుస్తులాపూర్‌లో వేపచెట్టుకు ఉరేసుకున్నాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు.

విద్యాసక్తిని వెలికి తీయడానికి టాలెంట్ టెస్ట్



పరీక్ష పత్రాన్ని విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్లఎడ్యుకేషన్/సిరిసిల్ల అర్బన్: విద్యార్థుల్లోని విద్యాసక్తిని వెలికి తీయడానికే టాలెంట్ టెస్టులు ఉపయోగపడుతాయని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ అన్నారు. సోమవారం సిరిసిల్లలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు. కొన్నేళ్లుగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించి ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. రానున్న వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు పాలాస మల్లేశం, కోల సరిత, టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అనిల్‌కుమార్, ప్రశాంత్, రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని స్టోన్ క్రషర్‌ను తొలగించాలి



రాళ్లపేట క్రషర్ వద్ద మాట్లాడుతున్న ప్రవీణ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని రాళ్లపేటలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న స్టోన్ క్రషర్‌ను తొలగించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాలగం ప్రవీణ్(టోని) డిమాండ్ చేశారు. సోమవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి క్రషర్‌ను సందర్శించారు. క్రషర్‌లో పనిచేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. మహిళలు స్నానాలు చేసేందుకు బాత్రూంలు, టాలెట్లు కూడా ఏర్పాటు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పన్ను ఎగవేసి పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారని తెలిపారు. క్రషర్‌తో వచ్చే దుమ్ము, ధూళితో శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి నిబంధనలు పాటించని క్రషర్‌ను మూసివేయించాలని, లేకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సర్పంచ్ బాలుసాని పర్శరాములు, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రాజు, మానవ హక్కుల యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిప్పంటుకుని వృద్ధుడి దుర్మరణం



మల్లయ్య(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): చుట్ట తాగుతూ నిప్పంటుకుని ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన ముస్తాబాద్‌లో విషాదం నింపింది. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు. ముస్తాబాద్‌కు చెందిన దీటి మల్లయ్య (80) తీవ్ర అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమయ్యాడు. కదలలేని స్థితిలో ఉన్న మల్లయ్య సోమవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో చుట్ట తాగుతుండగా.. అది తన బట్టలపై పడి మంటలు అంటుకున్నాయి. కదలలేని స్థితిలో ఉన్న మల్లయ్యను మంటలు చుట్టిముట్టాయి. భార్య నర్సవ్వ పని నిమిత్తం బయటకు వెళ్లింది. ఎవరూ గమనించకపోవడంతో మల్లయ్య పడుకున్న మంచం నవారు, బట్టలు మొత్తం కాలిపోయాయి. సాయంత్రం ఇంటికి చేరుకున్న నర్సవ్వ మంటల్లో కాలుతున్న భర్త మల్లయ్యను చూసి బోరున విలపించింది. తీవ్రంగా గాయపడ్డ మల్లయ్యను ఆసుపత్రికి తరలిస్తుండగానే మృతిచెందాడు. మృతుని కుమారుడు దేవయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇన్సినరేటర్ వితరణ



ఇన్సినరేటర్ అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

సిరిసిల్లఎడ్యుకేషన్: విద్యార్థులు వాడిన నాప్కిన్స్ వాతావరణ కాలుష్యానికి కారణం కాకుండా వాటిని కాల్చేసేందుకు ఉపయోగించే ఇన్సినరేటర్‌ను సిరిసిల్ల లయన్స్ క్లబ్ సభ్యులు సోమవారం సిరిసిల్లలోని నెహ్రూనగర్ ఉన్నత పాఠశాలకు వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ మాట్లాడుతూ వివిధ స్వచ్ఛంద సంస్థలు విద్యార్థులకు అవసరమైన వస్తువులు అందజేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు గుగ్గిళ్ల శైలజ, అయ్యప్ప రాము, బచ్చు భానుచందర్, చిట్నేని సంజీవరావు పాల్గొన్నారు.

కారు అదుపుతప్పి బోల్తా

- గాయాలతో బయటపడ్డ ఇద్దరు



పంట పొలంలో బోల్తాపడిన కారు

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండల కేంద్రం శివారులో సోమవారం కారు అదుపుతప్పింది. ఈ సంఘటనలో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. చందుర్తిలో నివసిస్తున్న ఇల్లందు ప్రసాద్, అతని బంధువుతో కలిసి సోమవారం జగిత్యాల జిల్లా భీమారం మండలం మోతుకులరావుపేటకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో చందుర్తి శివారుకు చేరుకోగానే కారు అదుపుతప్పింది. గాయపడ్డ ఇద్దరిని స్థానికి పీహెచ్‌సీకి తరలించారు.

రోడ్డుపై పడిన బియ్యం బస్తాలు



రహదారిపై పడిపోయిన బియ్యం బస్తాలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై సోమవారం లారీ నుంచి పీడీఎస్ బియ్యం బస్తాలు ప్రమాదవశాత్తు కింద పడ్డాయి. లారీ వెనుక వస్తున్న వాహనాలకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో కూలీలతో బస్తాలను మళ్లీ లోడు చేసి లారీని తరలించారు.